# ప్రజాతీర్పును గౌరవిస్తాం

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 8 : ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనకు అవకాశం ఇవ్వగా, పరిగి ప్రజలు గెలిపించగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన బీఆర్‌ఎస్ కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు జరిగేలా ప్రతిపక్ష పార్టీగా ముందుంటామన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏమి అవసరం ఉన్నా, తమవంతు సహకారం అందిస్తూ, ప్రజల్లో ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీపీ కరణం అరవిందరావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పి.వెంకటయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, సయ్యద్‌పల్లి సర్పంచ్ కె.వెంకట్‌రాంకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, నాగేశ్వర్, వేముల కిరణ్ పాల్గొన్నారు.

**కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలి**

దోమ : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకెళ్లాలని ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యలు తీర్చడానికి పోరాటం కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్‌లో నిర్వహించిన దోమ మండల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జడ్పీటీసీ నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు పార్టీకి ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని తెలుపుతూ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని గెలుపు, ఓటములను సమానంగా తీసుకొని ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజాసేవకు మరో పోరాటం కొనసాగించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలుపొందే విధంగా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మల్లేశం, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్యముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజ గోపాలచారి,యువ నాయకులు కృష్ణారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యకార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇస్తేమా కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 8 : పరిగి మండల పరిధిలో జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న ఇస్లాం మత ఇస్తేమా కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఇస్లాం మత పెద్దలతో ఇస్తేమా ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు రోజుల పాటు నిర్వహించే ఇస్తేమా సభకు అవసరమైన మిషన్ భగీరథ నీరు, విద్యుత్, రోడ్ల ఏర్పాటు వాహనాల పార్కింగ్ స్థలంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సోమవారం నుంచి ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ, ఇస్తేమాకు దాదాపు 2 లక్షల మంది హాజరవుతారని, మొదటి ప్రాధాన్యతగా నీరు, విద్యుత్ సదుపాయాలను అవసరం మేరకు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈలు చల్మారెడ్డి, బాబు శ్రీనివాస్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి, పంచాయతీరాజ్ శాఖ అధికారి తరుణ్‌కుమార్, పరిగి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, విద్యుత్ శాఖ ఇంజినీర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ



అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న ప్రసాద్‌కుమార్‌ను కలిసిన ట్రెసా నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 8 : తెలంగాణ రాష్ట్ర నూతన అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వికారాబాద్ జిల్లా పక్షాన ట్రెసా అధ్యక్షుడు బోయిని కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి జి.విజయేందర్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం జిల్లా కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని అసెంబ్లీ స్పీకర్ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. కొత్త ప్రభుత్వం రెవెన్యూ శాఖను పటిష్టపరిచి, గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని తొలగించి మేనిఫెస్టోలో పేర్కొన్న పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అమరేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

## పత్తి దిగుబడి పెంచాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ లక్ష్మణ్

పరిగి, డిసెంబర్ 8 : కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని, దాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ టి.లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయం, వ్యవసాయ పరిశోధన కేంద్రం, తాండూరు వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా పరిగి మండలం తొండపల్లి గ్రామంలో అధిక సాంద్రత పత్తి సాగు చేసిన రైతు రాంరెడ్డి పొలంలో క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ లక్ష్మణ్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి ఆవశ్యకతను రైతులకు వివరించారు. గత నెలలో ఇలాంటి ప్రదర్శన క్షేత్రాలు చింతలపల్లి, మేడిపల్లి, గట్టుపల్లి గ్రామాలలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పద్ధతిలో పంటకాలం త్వరగా పూర్తయి జనవరిలో రెండవ పంటగా పెసర, మినుములు వేసుకొని రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సి.యమున మాట్లాడుతూ పత్తిలో ఆశించే వివిధ రకాల చీడపీడలైన గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు సరైన మందులు పిచికారీ చేయాలన్నారు. పత్తిలో ఆశించే తామర పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి, కాయ తొలుచు పురుగుల సమగ్ర యాజమాన్య చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఉల్లి సాగులో ‘మిట్టబాసుపల్లి’ ఆదర్శం

**గ్రామంలో 90శాతం వరకు సాగు చేస్తున్న రైతులు**

**హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు**

**ధరలు పడిపోతున్నాయని రైతుల ఆవేదన**

**కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**



జినుగుర్తిలో ఉల్లిపంటసాగు చేస్తున్న రైతులు

తాండూరు రూరల్, డిసెంబర్ 8 : ఉల్లిపంట సాగుకు కేరాఫ్ అడ్రస్ మిట్టబాసుపల్లి నిలుస్తున్నది. జిల్లాలోనే అత్యధికంగా ఈ గ్రామంలోని రైతులు ఉల్లిపంటనుసాగు చేస్తారు. తాండూరు మండలం, మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లి, కోటబాసుపల్లి, సిరిగిరిపేట, జినుగుర్తి గ్రామాల్లో ఎక్కువగా ఉల్లి పంటసాగవుతున్నది. మిట్టబాసుపల్లి గ్రామంలో నూటికి 90 శాతం మంది రైతులు ఉల్లిపంట సాగుచేస్తారు. ప్రతి రైతుకు వ్యవసాయ బోరుబావి ఉంది. ఈ గ్రామంలో కంది, పెసర, మినుము, వరి వంటలు సాగు చేయరు. ప్రధాన పంటగా ఉల్లి పంటనే సాగు చేస్తారు. ఈ గ్రామంలో సుమారు 500 ఎకరాలకు పైగా ఉల్లి సాగు అవుతున్నది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఉల్లిపంటను సాగు చేస్తున్నారు. ఉల్లి పంట సాగుపై హార్టికల్చర్ అధికారులు శ్రద్ధ చూపడంలేదు. రైతులనే స్వయంగా తమకు తోచిన పురాతన వ్యవసాయం చేసుకుంటూ పంట సాగుచేసుకుంటున్నారు. ఈ పంట సాగు చేయాలంటే ఎకరాకు సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు అవుతున్నదని రైతులు అంటున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్లో ఉల్లి ధరలు గణనీయంగా పడిపోవడం పరిపాటిగా మారుతున్నది. ఉల్లి పంట సాగు తర్వాత మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులు ఉండడంతో ఒక్కోసారి రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పండించిన ఉల్లిని హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌కు తరలిస్తారు. సుమారు 110 కిలో మీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ మార్కెట్‌కు రవాణా చేస్తారు. రవాణా ఖర్చులు కూడా తడిసి మోపెడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెట్టుబడులు ఎక్కువ... ఆదాయం తక్కువ**

ఉల్లి పంట సాగుకు పెట్టుబడులు ప్రతి ఏటా ఎక్కువ అవుతున్నాయని రైతులు అంటున్నారు. ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. కానీ మార్కెట్లో ధర మాత్రం పెరగడంలేదు. పంట చేతికి వచ్చేనాటికి మార్కెట్లో ఉల్లి ధరలు పడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మహారాష్ట్ర నుంచి కూడా ఎక్కువగా తెలంగాణలోకి ఉల్లి వస్తుండడంతో ఈ ప్రాంతంలో పండించిన ఉల్లికి మార్కెట్ ధర రావడంలేదు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయంటున్నారు.


**కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది**



తాండూరు మండలంలో ఉల్లి రైతుల కోసం ఓ కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే కొన్నేండ్లుగా డిమాండ్ ఉన్నది. గతంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని తీర్మానం కూడా చేశారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. రైతు కష్టాలను దృష్టిలో పెట్టుకొని కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. కోల్డ్‌స్టోరేజీలో ఉల్లిని నిల్వ ఉంచుకొని మార్కెట్లో ధర వచ్చినప్పుడు విక్రయించుకునే అవకాశం లభించనుంది. ఈ విషయంలో పాలకులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నాం.

**- ఇస్మాయిల్, మిట్టబాసుపల్లి, తాండూరు**

**ధరలు స్థిరంగా ఉండవు..**



ఉల్లిపంట చేతికి వచ్చిన సమయంలో మార్కెట్లో ధరలు పడిపోతున్నాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల తెలంగాణలో పండించిన ఉల్లి పంట ధరలు స్థిరంగా ఉండడంలేదు. దాంతో ఒక్కోసారి రైతు విపరీతంగా నష్టం చవిచూడాల్సి వస్తున్నది. ఒక్కోసారి మార్కెట్లో ధరలు పెరుగుతున్నాయి. హెచ్చుతగ్గుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ధరలు స్థిరంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది.

**- పెంటయ్యగౌడ్, మిట్టబాసుపల్లి,తాండూరు**